

ముహూర్తం ఖరారు

కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ ఎంపికకు శుక్రవారం జిల్లా సహకార సంఘం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 10లో▸



మా భూములు లాక్కోవద్దు

తమ భూములు లాక్కోవద్దని కొడంగల్ మండలంఅప్పాయిపల్లి రైతులు శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. 10లో▸



ఎన్నాళ్లీ అవస్థలు

వికారాబాద్ పట్టణం చుట్టూ రైల్వేలైన్ ఉండటంతో మూడు మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 11లో▸

న్యూస్‌రీల్

మేడారం జాతరకు 46 బస్సులు

తాండూరు టౌన్: మేడారం సమ్మక్క, సారక్క జాతరకు తాండూరు ఆర్టీసీ డిపో నుంచి 46 బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ సమత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18నుంచి 25వ తేదీ వరకు బస్సులు మేడారానికి వెళతాయని తెలిపారు. మిగిలిన 47 బస్సులతో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేయనున్నట్లు తెలిపారు. బస్సుల సంఖ్య తగ్గనున్న నేపథ్యంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ నెల 26 నుంచి పూర్తి స్థాయిలో బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

శాస్త్రవేత్తలకు మంత్రి తుమ్మల అభినందనలు



మంత్రి తుమ్మలకు కందిపప్పు గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్

తాండూరు టౌన్: తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రి యూనివర్సిటీలో ప్రారంభమైన అగ్రిటెక్ సౌత్ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో తాండూరు కందిపప్పు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను మంత్రి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాండూరు కందిపప్పు ఎంతో ప్రసిద్ధి చెందిందని, భౌగోళిక గుర్తింపు కూడా వచ్చిందని పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ మంత్రికి వివరించారు. శాస్త్రవేత్తలు, సిబ్బంది పనితీరును మెచ్చుకొని అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సూపరింటెండెంట్



విజయ్‌భాస్కర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

అనంతగిరి: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విజయభాస్కర్ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. పూలమాలలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

- డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: తాండూరు డీఎస్పీగా బాలకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్ కొత్తగా వచ్చిన బాలకృష్ణారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో సమర్థవంతంగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ ప్రాంత ప్రజల సహకారం మరచిపోలేనిదన్నారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం తాండూరు పట్టణ సీఐ సంతోష్, రూరల్ సీఐ అశోక్ నూతన డీఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శేఖర్‌గౌడ్‌కు వీడ్కోలు పలికారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

సప్త వాహనాలపై శ్రీవారి దర్శనం

పేదల తిరుపతిగా పేరుగాంచిన స్థానిక పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవేరుల సమేత మలయప్ప స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన శ్రీవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా ఆలయంలో చిన్న శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, సర్వభూపాల వాహనం, కల్పవృక్ష వాహనం, చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరించారు. అర్చకులు శ్రీవారి మూలవిరాట్టుకు అభిషేకం, ముత్యాల పందిరి, తిరుమంజనం తదితర పూజలు చేశారు.

– కొడంగల్



గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

తలోదారి..!



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సునీతారెడ్డి తదితరులు

వేర్వేరు పార్టీల్లో పట్నం దంపతులు

- హస్తం గూటికి జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- బీఆర్‌ఎస్‌లోనే పట్నం మహేందర్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరేది లేదని తేల్చేసిన నరేందర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి

వికారాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఓ వెలుగు వెలిగిన పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం నేడు తలోదారి అన్నట్లుగా మారింది. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తన కుమారుడితో కలిసి హస్తం గూటికి చేరగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాత్రం బీఆర్‌ఎస్‌లోనే ఉండి పోయారు. సునీతారెడ్డి తనయుడితోపాటు పలువురు అనుచరులతో కలిసి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరి వెంట తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ టీ స్వప్న, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల ముందు మరో షాక్ తగిలినట్టయ్యింది. అయితే మహేందర్‌రెడ్డి సోదరుడు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, వారి సోదరుడి కుమారుడు షాబాద్ ఎంపీపీ అవినాష్‌రెడ్డి సునీతారెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరిగినా బీఆర్‌ఎస్‌లోనే ఉండిపోయారు. తాము బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని సోదరుడు మహేందర్‌రెడ్డికి తేల్చి చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై ఇప్పటికే స్పష్టతనిచ్చిన నరేందర్‌రెడ్డి తనతో పాటు అవినాష్ రెడ్డి కూడా బీఆర్‌ఎస్‌లోనే ఉంటారని మీడియా ముఖంగా పేర్కొన్న విషయం తెలిసిందే.

బీఆర్‌ఎస్‌లోనే బాబాయ్.. అబ్బాయ్

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడించిన మహేందర్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేది లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఇటీవలి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేతిలో ఓటమిని చవిచూసిన నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడం సబబుకాదని భావిస్తున్నట్లు సమాచారం. అయితే 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి డీ లిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) జరిగితే కొడంగల్ నుంచి చీలిపోయి కొత్తగా ఏర్పాటయ్యే నియోజకవర్గం నుంచి తాను మళ్లీ బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో డీ లిమిటేషన్ జరిగి చేవెళ్ల నియోజకవర్గం రెండుగా చీలి అందులో ఒకటి జనరల్‌గా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్న నరేందర్‌రెడ్డి అన్న కుమారుడు అవినాష్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు నిరాకరించినట్లు సమాచారం.

బీఆర్‌ఎస్‌లో తానొక్కడే..

రెండేళ్ల నుంచి బీఆర్‌ఎస్‌లో వర్గపోరును ఎదుర్కొంటు వస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గూటికి చేరుతారని అందరు భావించారు. అయితే ఎన్నికలకు రెండు నెలల ముందు అప్పటి సీఎం కేసీఆర్ పట్నంకు మంత్రి పదవి కట్టబెట్టడంతో తన ఆలోచనను విరమించుకున్నారు. అయితే పట్నం దంపతులు కాంగ్రెస్‌లో చేరకపోయినా మెజార్టీ అనుచరులు హస్తం పార్టీలో చేరిపోయారు. వారి చేరిక వెనుక పట్నం దంపతులు ఉన్నట్లు ప్రచారం కూడా జరిగింది. అయితే మిగిలిన వారు కూడా సునీతారెడ్డితో కలిసి శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో మహేందర్‌రెడ్డి మాత్రమే బీఆర్‌ఎస్‌లో మిగిలి పోయారు. అయితే మండలిలో బీఆర్‌ఎస్‌కు బలం ఎక్కువగా ఉన్నందున ఫిరాయింపుల చట్టం వర్తింపజేస్తే ఎమ్మెల్సీ పదవి కోల్పోవాల్సి వస్తుందనే కారణంతోనే మహేందర్‌రెడ్డి అధికారికంగా కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని సమాచారం.

రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

పెద్దేముల్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దేముల్‌లో తాండూరు – సంగారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు రూ.100 కూడా గిట్టుబాటు కావడం లేదన్నారు. ఆటో కొనుగోలుకు ఫైనాన్స్ తెచ్చామని ఆ డబ్బులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొంత మంది ఆటో డ్రైవర్లు కుటుంబ భారం, తెచ్చిన అప్పులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకోడానికి సిద్ధమయ్యారన్నారు. తమకు ఆరోగ్య భద్రత కార్డు, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తే రూ.300 వచ్చేవని, ఉచిత బస్సుల కారణంగా తమ బతుకులు బజారున పడ్డాయని వాపోయారు. నిరసన కార్యక్రమంలో పెద్దేముల్, నాగులపల్లితో పాటు పలు గ్రామాల ఆటో డ్రైవర్లు కండప్ప, మల్లప్ప, దర్మీది శ్రీనివాస్, జనార్దన్, వెంకటయ్య, పరుషరాం, అంజీ, అమరేందర్, అమీర్, ఆసీఫ్, మోజమ్, షఫీ, మంజురు పాల్గొన్నారు.

కర్ణాటక తరహాలో మైనింగ్ పాలసీ అమలు చేయాలి

- అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: కర్ణాటక తరహాలో తాండూరులో మైనింగ్ లీజును సులభతరం చేసి నాపరాతి పరిశ్రమను మెరుగు పరచాలని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో కోరారు. తాండూరు నియోజకవర్గం భూగర్భ ఖనిజ నిక్షేపాలకు నిలయమని పేర్కొన్నారు. నాపరాయి, సుద్ద నిక్షేపాలు ఉండటంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు వెలిశాయని తెలిపారు. వాటి ద్వారా సుమారు 15వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. అయితే గనుల శాఖ లీజు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాయల్టీ ఫీజు అధికంగా ఉండటంతో వ్యాపారులు నష్టపోతున్నట్లు సభలో ప్రస్తావించారు. గతంలో టన్నుకు రూ.80 చొప్పున రాయల్టీ వసూలు చేసేవారని, ప్రస్తుతం రూ.180 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో గనులకు సులువుగా లీజుకు ఇస్తున్నారని, రాయల్టీ సైతం తక్కువేనని సభాపతికి విన్నవించారు. కర్ణాటక తరహాలో ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. పెద్దేముల్ మండలంలో సుద్ద నిక్షేపాలు కలిగిన వారంతా రెండు ఎకరాల లోపు రైతులేనని, వారికి సుద్ద తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. తాండూరు నియోజకవర్గ పరిధిలో కోట్‌పల్లి, జుంటిపల్లి ప్రాజెక్టులు ఉన్నాయని, వాటిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరాయని తెలిపారు. ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తాండూరులో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. బషీరాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తెచ్చేలా చూడాలని కోరారు. తాండూరు కందిపప్పునకు దేశంలోనే పేరుందని, కంది బోర్డు ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తెచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ తాండూరు ప్రాంత సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

మహిళపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

దోమ: మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన దోమ మండల పరిధిలో చోటు చేసుకుంది. మోత్కూరు గ్రామ శివారులో కట్ట మైసమ్మ దేవాలయ సమీపంలో కుల్కచర్ల గ్రామానికి చెందిన ఒక మహిళ తలకు గాయమై పడి ఉంది. స్థానికులు గమనించి పంచాయతీ కార్యదర్శి రాములుకు విషయం తెలపగా 108కి ఫోన్‌ చేసి ఆమెను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు కింద పడి ప్రయాణికురాలికి గాయాలు

రెండు కాళ్లు విరిగిన వైనం



బస్సు టైర్‌ కింద పడి విరిగిన మహిళ కాళ్లు

పరిగి: ప్రయాణికురాలు ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా టైర్‌ కింద రెండు కాళ్లు పడటంతో విరిగిన సంఘటన పరిగి బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన సత్యమ్మ పని నిమిత్తం పరిగికి వచ్చి తిరుగు ప్రయాణంలో భాగంగా బస్టాండ్‌లో కొడంగల్‌ బస్సు ఎక్కుతుండగా కదిలింది. దీంతో బస్సు టైర్‌ కింద ఆమె రెండు కాళ్లు పడటంతో రక్తగాయాలు అయి విరిగి పోయాయి. వెంటనే గమనించిన ప్రయాణికులు బస్సు ఆపి టైర్‌ కింద ఉన్న ఆమెను బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అతిథి గృహం.. ఆకర్షణీయం!



రంగులతో ముస్తాబైన గెస్ట్‌ హౌస్‌

కొడంగల్‌: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నూతనంగా ముస్తాబు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అధిక మొత్తంలో నిధులు వెచ్చించి ఏసీలు, అధునాతన ఫర్నీచర్‌, బెడ్లు, డైనింగ్‌ టేబుల్‌, కుర్చీలు, బీరువాలు కొనుగోలు చేశారు. అతిథి గృహానికి రంగులు వేశారు. త్వరలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో అధికారుల విడిది కోసం అందగా తీర్చి దిద్దారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాఘవేందర్‌ (ఫైల్‌)

పరిగి: బైక్‌ అదుపు తప్పి కింద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హన్మన్‌గండీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూర్‌ మండలం కేరవెళ్లి గ్రామానికి చెందిన మంగళి రాఘవేందర్‌(35) పని నిమిత్తం పరిగికి వచ్చిన తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో హన్మన్‌గండీ సమీపంలో బైక్‌ అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలైన అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మాధవి, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సడెన్‌ బ్రేక్‌తో వాహనాల ఢీ

ఐదు కార్ల వెనుక భాగాలు ధ్వంసం

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనం సడెన్‌గా బ్రేక్‌ వేయటంతో వెనుకనున్న ఐదు వాహనాలు ఒకదాని ఒకటి ఢీకొన్నాయి. ఈ సంఘటన చేవెళ్ల మండల కేంద్రంలోని ముడిమ్యాల బస్టాప్‌ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌ నుంచి చేవెళ్ల వైపు వస్తున్న వాహనాలకు ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ఓ కారు బస్టాప్‌ రావటంతో స్పీడ్‌ను తగ్గించింది. వెనకాల ఉన్న మరో కారు సడన్‌గా వేగాన్ని తగ్గించడంలో నియంత్రణ తప్పి ముందు కారును ఢీకొట్టింది. అదే క్రమంలో వరుసగా ఐదు కార్లు ఢీకొన్నాయి. దీంతో వాటి వెనక భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. వాహనాలను పక్కకు తీసి పోలీసులు ట్రాఫిక్‌ క్లియర్‌ చేశారు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం



దోమ ప్రాథమిక సహకార సంఘం

ముహూర్తం ఖరారు

- కుల్కచర్ల పీఏసీఎస్‌ చైర్మన్‌ ఎంపికకు నోటిఫికేషన్‌ జారీ
- 18న ప్రత్యేక సమావేశం

కుల్కచర్ల: కుల్కచర్ల పీఏసీఎస్‌ చైర్మన్‌ ఎంపికకు శుక్రవారం జిల్లా సహకార సంఘం అధికారులు నోటిఫికేషన్‌ జారీ చేశారు. మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో చైర్మన్‌ పదవి ఖాళీ అయిన విషయం తెలిసిందే. కొత్త చైర్మన్‌ ఎంపికలో భాగంగా అధికారులు ఆయా గ్రామాల డైరక్టర్లను కలసి నోటిఫికేషన్‌ పత్రాలు అందజేసినట్లు తెలిసింది. ఈ నెల 18న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కుల్కచర్ల పీఏసీఎస్‌లో 13 మంది బీఆర్‌ఎస్‌ మద్దతుదారులు డైరక్టర్లు ఉన్నారు. అయితే కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చైర్మన్‌ పదవి కూడా ఆ పార్టీ వశం కానున్నట్లు తెలిసింది. ఆదివారం జరిగే విశ్వాస పరీక్ష, చైర్మన్‌ ఎన్నిక సజావుగా సాగుతుందా..? మరేదైనా కొత్త కోణం వెలుగులోకి వస్తుందా..? అనేది వేచి చూడాల్సి ఉంది. కాగా నూతన చైర్మన్‌గా కనకం మొగులయ్య, వైస్‌ చైర్మన్‌గా కొండయ్యను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

అవిశ్వాస తీర్మానం వాయిదా

దోమ: దోమ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌పై డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. శుక్రవారం జరగాల్సిన ఈ కార్యక్రమానికి జిల్లా కోఆపరేటివ్‌ అధికారి హాజరు కాకపోవడంతో రద్దు చేసినట్లు సీఈఓ యాదగిరి తెలిపారు. ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్‌తో కలిపి 13మంది డైరెక్టర్లు ఉన్నారు. మెజార్టీ డైరెక్టర్లు చైర్మన్‌ మార్పుపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. దీంతో అధికారులు తీర్మానం తేదీని ప్రకటించారు. అయితే కుల్కచర్లలో జరుగుతున్న అవిశ్వాస తీర్మానానికి డీసీవో వెళ్లడంతో ఇక్కడి కార్యక్రమం వాయిదా వేసినట్లు సీఈఓ యాదగిరి తెలిపారు. త్వరలో మరో తేదీని ప్రకటిస్తారని చెప్పారు.

చైర్మన్‌ పదవిపై ఉత్కంఠ

దోమ పీఏసీఎస్‌ చైర్మన్‌ పదవి దక్కాలంటే 1/3 నిష్పత్తి ప్రకారం డైరెక్టర్ల మద్దతు అవసరం. అయితే ఈ పీఏసీఎస్‌లో 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒకరు చనిపోయారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 9 మంది డైరెక్టర్ల మద్దతు అవసరం. ప్రస్తుతం ఉన్న 12 మందిలో 8 మంది చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించారు. ప్రస్తుత చైర్మన్‌కు నలుగురు డైరెక్టర్లు మద్దతు ఉన్నట్లు సమాచారం. అయితే ఒక డైరెక్టర్‌ మృతి చెందడంతో అవిశ్వాసాన్ని ఎలా కొనసాగిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

పాత పెన్షన్‌ను అమలు చేయాలి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌
- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఉద్యోగులు

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్‌ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో వికారాబాద్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఎదుట టీఎన్జీవో ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్‌ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ప్రభుత్వ ఉద్యోగులపై గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆదాయపు పన్నును రూ.10 లక్షలకు పెంచాలని, ఔట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్ట్‌ ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలన్నారు. ఉద్యోగులకు సమాన పనికి.. సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయటం తామెప్పుడు వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి అజ్మత్‌ పాషా, అసోసియేట్‌ అధ్యక్షుడు నర్సింలు, కోశాధికారి రమేశ్‌, వికారాబాద్‌ తాలూకా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ అరుణకుమారి, జాయింట్‌ సెక్రటరీ శ్రావణి, హీరాలాల్‌, సాయికుమార్‌, ఆఫీస్‌ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు నిర్మలా, శ్రీదేవి, విజయ్‌, లాలూ, నరేందర్‌, శ్రీకాంత్‌, బాలకృష్ణ, వాసు, మాణిక్యం, ఇతర శాఖల ఫోరం అధ్యక్షులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న టీఎన్జీవో నేతలు

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

- ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు

పరిగి: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్‌ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిజన నర్సమ్మ(73) ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్‌తో జీవిస్తున్నారు. వృద్ధురాలికి సంతానం లేకపోవడం, భర్త మృతి చెందడంతో ఒంటరిగానే కాలం వెళ్లదీస్తున్నారు. రోజూ ఉదయం ఆమె ఇంట్లో నుంచి వచ్చి చుట్టుపక్కల వాళ్లతో మాట్లాడేది. కానీ శుక్రవారం ఎంత సేపు అయినా ఇంటి నుంచి బయటకి రాకపోడంతో అనుమానం వచ్చిన తలుపు తెరిచి చూడగా నర్సమ్మ విగతజీవిగా పడి ఉన్నారు. ఒంటిపై గాయాలు ఉండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలు తలపై, కళ్లపై రక్తగాయాలు ఉండటంతో క్లూస్‌ టీం ద్వారా వివరాలను సేకరించారు. దీనిపై పోలీసులు అనుమానం ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతురాలికి సంతానం లేకపోవడంతో తన పేరు మీద ఉన్న భూమి కోసం ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పలువురిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్‌ తెలిపారు. సంబంధిత వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మహరాజ్‌కు ప్రభుత్వంలో చోటు

- రాష్ట్ర ఫైనాన్స్‌ కమిషన్‌ సభ్యుడిగా రమేశ్‌మహరాజ్‌

తాండూరు: ఏఐసీసీ సభ్యుడు, తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్‌ మహరాజ్‌కు ఎట్టకేలకు కాంగ్రెస్‌ ప్రభుత్వంలో పదవి వరించింది. సెకండ్‌ స్టేట్‌ ఫైనాన్స్‌ కమిషన్‌లో నలుగురుతో కూడిన బృందాన్ని నియమిస్తూ గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల కాల పరిమితితో ఫైనాన్స్‌ పదవిలో కొనసాగనున్నారు. చైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, సభ్యులుగా రమేశ్‌ మహరాజ్‌, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూనాయక్‌లు సభ్యులుగా ఉన్నారు.

నామినేటెడ్‌ పదవిలో తొలిసారి

తాండూరు ప్రాంతానికి చెందిన మహరాజుల కుటుంబం దశాబ్దాలుగా రాజకీయాలను చక్రం తిప్పారు. ఆ కుటుంబం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా, ఇద్దరు మంత్రులుగా కొనసాగారు. మాజీ మంత్రి మాణిక్‌రావు తనయుడు అయిన రమేశ్‌ మహరాజ్‌ 2009లో కాంగ్రెస్‌ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చినా స్థానిక రాజకీయాల కారణంగా తప్పుకొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో సైతం పోటీ చేసే అవకాశం ఉన్నా మరొకరికి అవకాశం కల్పించారు. రెండుసార్లు టికెట్‌ త్యాగం చేసి కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యేల గెలుపునకు కీలకంగా మారారు. మరోవైపు మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం కాంగ్రెస్‌ పార్టీలో చేరింది. దీంతో అంతా మహరాజుల కుటుంబ రాజకీయాలు కాలగర్భంలో కలిసిపోయాయని అంతా భావించారు. కానీ పట్నం మహేందర్‌రెడ్డి గాంధీభవన్‌లో అడుగు పెట్టిన రోజే రమేశ్‌ మహరాజ్‌కు రాష్ట్ర ఫైనాన్స్‌ కమిషన్‌లో సభ్యులుగా అవకాశం కల్పించడం సర్వాత్ర హర్షం వ్యక్తమైంది. అనంతరం నూతనంగా నియమితులైన కమిషన్‌ చైర్మన్‌, సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫైనాన్స్‌ కమిషన్‌ చైర్మన్‌, సభ్యుడు రమేశ్‌ మహరాజ్‌

బస్సు ఎక్కుతుండగా చోరీ

తాండూరు టౌన్‌: బస్సు ఎక్కుతుండగా ఓ ప్రయాణికుడి జేబులోని రూ.49 వేల నగదు చోరీకి గురైన సంఘటన తాండూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నారా నాగప్ప పని నిమిత్తం చించోళివెళ్లి అక్కడి బ్యాంకు నుంచి రూ.49 వేలు విత్‌డ్రా చేసి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు తాండూరు బస్టాండుకు వచ్చాడు. అప్పటి వరకు జేబులోనే ఉన్న నగదు బస్సు ఎక్కిన తర్వాత కనపడలేదు. బస్సెక్కేటప్పుడు రద్దీ విపరీతంగా ఉండటంతో ఎవరో చోరీ చేసినట్లు గ్రహించాడు. వెంటనే చోరీ విషయమై తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రోహిత్‌రెడ్డికి షాక్‌ ఇచ్చిన నేతలు

- కారు దిగి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు
- పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకటరామిరెడ్డి హస్తం గూటికి

బషీరాబాద్‌: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి బిగ్‌ షాక్‌ ఇచ్చారు ఆయన వర్గీయులు. బషీరాబాద్‌ మండలానికి చెందిన బీఆర్‌ఎస్‌ ముఖ్య నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో వికారాబాద్‌ జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో నావంద్గీ పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకటరామిరెడ్డి, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ అరుణ, బీఆర్‌ఎస్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శంకర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ మాణిక్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి కాంగ్రెస్‌ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్‌ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హస్తం గూటికి చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల వరకు రోహిత్‌రెడ్డితో పనిచేసిన నాయకులంతా మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశమైంది.



కాంగ్రెస్‌లో చేరుతున్న వెంకటరామిరెడ్డి, నాయకులు

ఎట్టకేలకు గాంధీభవన్‌కు పట్నం..!



కాంగ్రెస్‌ నేతలతో గాంధీభవన్‌ మెట్లపై పట్నం దంపతులు

- మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ పార్టీతోనే పోరాటం
- బలమైన నేతలు దూరం కావడంతో డీలాపడ్డ బీఆర్‌ఎస్‌

తాండూరు: ఎట్టకేలకు పట్నం దంపతులు గాంధీభవన్‌ మెట్లెక్కారు.. శుక్రవారం పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ సమక్షంలో పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తన రాజకీయ జీవితమంతా కాంగ్రెస్‌ పార్టీతోనే పోరాటం చేస్తూ వచ్చారు. 1994లో తాండూరు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు రంగారెడ్డి జిల్లా షాబాద్‌ మండలం నుంచి తాండూరుకు వచ్చారు. అప్పట్లో తాండూరు అంటేనే మహరాజులకు, కాంగ్రెస్‌ పార్టీకి కంచుకోట.. అయితే మాజీ మంత్రి మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే నారాయణరావుల మధ్య కుటుంబ విభేదాలు తలెత్తడంతో తాండూరు అసెంబ్లీకి ఇద్దరు పోటీ చేశారు. దీంతో ఓట్లు భారీగా చీలిపోవడంతో పట్నం మహేందర్‌రెడ్డి విజయం సాధించారు. మంత్రిగా కొనసాగిన మాణిక్‌రావు ఓడించి అందరి దృష్టి ఆకర్షించారు. అప్పటినుంచి 2023 వరకు ప్రతి ఎన్నికలలో కాంగ్రెస్‌ పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. మూడు దశాబ్దాల పాటు పార్టీ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వచ్చారు. మరోవైపు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని 2018లో ఓడించి తన సోదరుడిని బీఆర్‌ఎస్‌ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపించుకున్నారు. మూడు దశాబ్దాలుగా విభేదించిన కాంగ్రెస్‌ పార్టీలో చేరేందుకు తొలిసారి పట్నం మహేందర్‌రెడ్డి గాంధీభవన్‌ మెట్లు ఎక్కడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

బీఆర్‌ఎస్‌కి తీవ్ర నష్టం

బీఆర్‌ఎస్‌ పార్టీకి ఉమ్మడి జిల్లాలో బలమైన నేతలను కోల్పోవడం తీవ్ర నష్టం కలిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాలలో తిరుగులేని శక్తిగా పట్నం మహేందర్‌రెడ్డి మూడు దశాబ్దాలుగా రాజకీయాలలో చక్రం తిప్పుతున్నారు. నాలుగేళ్లుగా బీఆర్‌ఎస్‌ పార్టీలో మాజీ సీఎం కేసీఆర్‌ పట్నం దంపతులకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మరోవైపు నాలుగేళ్లుగా జిల్లాలోని ఎమ్మెల్యేల తీరుతో పట్నం దంపతులు విరక్తి చెందారు. ఈ పరిస్థితుల నడుమ పార్టీ నుంచి వీడి తొలిసారి జాతీయ కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.

మా భూములు లాక్కోవద్దు

- రెవెన్యూ అధికారులు వేధిస్తే ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేస్తాం
- ఆర్డీఓకు అప్పాయిపల్లి రైతుల వినతి
- స్పందించకుంటే ఉద్యమిస్తాం

తాండూరు టౌన్‌: తమ భూములను లాక్కోవద్దని కొడంగల్‌ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ రైతులు శుక్రవారం తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొడంగల్‌ అభివృద్ధి పేరుతో మెడికల్‌ కళాశాల నిర్మాణం కోసం అప్పాయిపల్లి సర్వే నంబర్‌ 19లోని 74.17 ఎకరాల దళిత, బహుజనుల భూమిని ప్రభుత్వం లాక్కోవాలని చూస్తోందన్నారు. కొడంగల్‌ తహసీల్దార్‌, రెవెన్యూ సిబ్బంది ఉద్యోగాలు, నష్ట పరిహారం ఇప్పిస్తామని రైతులను మభ్య పెడుతున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమిని అభివృద్ధి పేరిట తీసుకొని, తమను రోడ్డున పడేయవద్దని వాపోయారు. మండల పరిధిలో భూస్వాములు, దొరలకు సంబంధించిన వందలాది పోరంబోకు భూములు ఉన్నాయని, అభివృద్ధి కోసం ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు. దళిత, బహుజనులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవద్దని విన్నవించుకున్నట్లు చెప్పారు. రెవెన్యూ అధికారులు తమను వేధిస్తే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, వెంకటయ్య, రైతులు ఎరాన్‌పల్లి శ్రీనివాస్‌, ఫకీరప్ప, శ్రీనాథ్‌ సింగ్‌, బుగ్గప్ప, బసప్ప, శానప్ప గౌడ్‌, పద్మమ్మ, అంజయ్య, వెంకటమ్మ ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.



ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పాయిపల్లి రైతులు

అనంత పద్మనాభుడి రథసప్తమి

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని స్వామి వారిని సప్త వాహనాలపై ఊరేగించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన సేవల్లో భాగంగా ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని సాయంత్రం వరకు హనుమంత, ముత్యాలపందిరి, గరుడ వాహనాలపై ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దంపతులు చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌ కుమార్‌ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్‌, కౌన్సిలర్‌ కిరణ్‌పటేల్‌, ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గలో ఘనంగా ఊరేగింపు

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణానికి సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన సూర్య దేవాలయంలో రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణం, గణపతిపూజ, నవగ్రహారాధన నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవ ఆలయ మాడవీధుల్లో నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ చిగుళ్లపల్లి మంజులరమేష్‌కుమార్‌, కౌన్సిలర్లు శ్రీదేవిసదానందరెడ్డి, దేవీరెడ్యానాయక్‌, బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, అర్చకులు, ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణంలో పాల్గొన్న చైర్‌పర్సన్‌



బుగ్గలో సూర్యనారాయణస్వామి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



సింహవాహనాన్ని మోస్తున్న భక్తులు



గరుడ వాహనంపై స్వామి వారు

రేపు సీఓఈ సెట్‌ ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్‌: గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో చేరేందుకు కాలేజ్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ(సీఓఈ) సెట్‌ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని నూర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో 312 మంది విద్యార్థినులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

మాడ్గుల: తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడగా గీత కార్మికుడికి గాయలైన సంఘటన మాడ్గుల మండలంలోని ఇర్విన్‌ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామనికి చెందిన మాదాసు యాదయ్య గౌడ్‌ రోజువారి పనిలో భాగంగా తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఆయనని స్థానిక ఆస్పత్రికి తరలించారు.